అకాడమిక్ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 18: కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2018-19 అకాడమిక్ ఇయర్‌లో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు.. ఆ సమయంలో స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు తమ దగ్గర ఉన్న స్కాలర్‌షిప్ అప్లై ప్రూఫ్‌లను కళాశాలకు అందజేయాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అలివేలు మంగమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. 2018-19 అకాడామిక్ ఇయర్‌లో బీఏ, బీఎస్సీ, బీకామ్ కోర్సులలో చేరి చదువును పూర్తి చేసిన వారు.. ఈనెల 30లోపు స్కాలర్‌షిప్ అప్లై చేసిన రసీదులను కళాశాలలో అప్పగించాలని కోరారు. ఫీజు రీయింబర్స్ డబ్బులు విద్యార్థుల బ్యాంకు అకౌంట్‌లో జమ చేయడం జరుగుతుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 18 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో శుక్రవారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 43, వంకాయ 35, బెండకాయ 45, పచ్చిమిర్చి 28, బజ్జి మిర్చి 75, కాకరకాయ 35, బీరకాయ 45, క్యాబేజి 25, ఫ్రెంచ్ బీన్స్ 125, క్యారెట్ 40, కాలీఫ్లవర్ 23, దొండ 28, చిక్కుడు 65, గోరుచిక్కుడు 35, బీట్ రూట్ 28, క్యాప్సికం 75, ఆలుగడ్డ 37, కీరా 23, దోసకాయ 35, సొరకాయ 25, పొట్లకాయ (1) 23, కందగడ్డ 55, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 45, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 45, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 35, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు(12) 50 నుంచి 60, మునగకాయ(1) 8 నుంచి 10, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 160, వెల్లుల్లి 360, చింతపండు 140, కరివేపాకు 60గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

వివాహిత అదృశ్యం

తులసి(ఫైల్)

జగద్గిరిగుట్ట, అక్టోబర్18 : కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత కనిపించకుండా పోయింది. జగద్గిరిగుట్ట పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిలకజోస్యంతో జీవనం సాగించే రాంచందర్, తులసి(25)దంపతులు గాజులరామారం డివిజన్ భవానీనగర్‌లో నివాసముంటారు. ఈనెల 11న దంపతులకు గొడవ జరగగా తులసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో రాంచందర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. శుక్రవారం కేసు నమోదైంది.

వివిధ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 18: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులైన బీహెచ్ఎంసీటీ, బీసీటీసీఏ కోర్సులతో పాటు బీసీఏ ఆరో సెమిస్టర్ మేకప్ పరీక్ష ఫీజును ఈనెల 28వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. బీహెచ్ఎంసీటీ, బీసీటీసీఏ, బీసీఏ కోర్సుల మొదటి, మూడు, అయిదో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, రెండు, నాలుగో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును వచ్చే నెల 4వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

నిరుపేదల జోలికొస్తే ఊరుకోం

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తా..

క్యాంపు కార్యాలయంలో అల్లాపూర్ డివిజన్ ప్రజా సమస్యలపై సమీక్షలో ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సబిహాబేగం

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 18: రాజీవ్‌గాంధీనగర్, సప్థార్‌నగర్‌లలో నివసిస్తున్న నిరుపేదల జోలికొస్తే.. వారికి అండగా నిలబడి పోరాడుతానని, ప్రజలు భయభ్రాంతులకు గురికాకుండా ధైర్యంగా ఉండాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యలపై అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహాబేగం, ప్రజలతో ఎమ్మెల్యే కృష్ణారావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీనగర్, సప్థార్‌నగర్ కాలనీలో ఎన్నో ఏండ్లుగా పేద ప్రజలు నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారని, వారి ఇండ్లపై వస్తున్న అపోహలను పట్టించుకోవద్దన్నారు. కుటుంబాలతో నివసిస్తున్న నిరుపేదల జోలికి వస్తే తాను అండగా నిలబడుతానన్నారు. ప్రజలు ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. అలాగే అల్లాపూర్ డివిజన్ పరిధిలో తాగునీరు, డ్రైనేజీ, రోడ్డు సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని, ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి సత్వరమే పరిష్కరించేలా పని చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గౌసుద్దీన్, ఐలయ్య, వీరారెడ్డి, బాబా, పలు కాలనీల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గాలి కాలుష్యం నుంచి కాపాడాలని శ్రీశైలంగౌడ్‌కు వినతి

హెచ్ఎంటీ మైదానంలో పేరుకుపోయిన వ్యర్థాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

దుండిగల్, అక్టోబర్ 18 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం(సర్కిల్) డివిజన్ పరిధిలోని సుభాష్ చంద్రబోస్‌నగర్-ఏ, శ్రీరామ్‌నగర్‌లో స్థానికంగా నెలకొన్న దుర్వాసనతో గాలి కాలుష్యం కారణంగా ఇబ్బంది పడుతున్నట్లు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూనశ్రీశైలంగౌడ్ దృష్టికి నవ యుగ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానికులు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన శ్రీరాంనగర్ కాలనీ, పోచమ్మగుడి ప్రాంతంలోని హెచ్ఎంటీ మైదానంలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కెమికల్ కంపెనీల నుంచి వచ్చే వేస్టేజ్‌ను కాలబెడుతున్నారని, దీని కారణంగా దట్టమైన పొగలు వెలువడి గాలిలో కలిసి వ్యాపించడం వలన గాలి కలుషితం అవుతుందన్నారు. దీంతో జలుబు, దగ్గుతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఫ్యాక్టరీల నుంచి తీసుకువచ్చిన వ్యర్థాలను తగలబెటుతున్నారని, ఆ మార్గాన్ని మూసివేయాలని అధికారులను కోరారు. త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నవ యుగ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ జహంగీర్ హుస్సేన్, ప్రెసిడెంట్ బాలరాం, రాజు, సలీం, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విదేశీ భాషల్లో డిప్లామా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 18: ఓయూ పరిధిలో వివిధ విదేశీ భాషల్లో డిప్లామా కోర్సులకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్రెంచ్, జర్మన్ భాషల్లో నాలుగు నెలల జూనియర్, సీనియర్ డిప్లామా కోర్సులను అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కోర్సుల్లో ప్రవేశాలకు చివరి తేదీ డిసెంబర్ 2. కాగా తరగతులు నవంబర్ 30 నుంచే ప్రారంభమవుతాయన్నారు. తరగతులు రోజూ ఉదయం 7 నుంచి తొమ్మిది 9 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారు జూనియర్ డిప్లామాలో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. సీనియర్ డిప్లామాలో చేరేందుకు కనీసం యాభై శాతం మార్కులతో జూనియర్ డిప్లామా కానీ, యూజీలో సంబంధిత భాషను సెకెండ్ లాంగ్వేజ్‌గా చదివి ఉండాలని చెప్పారు. వివరాలకు 83310 41309 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

హైదరాబాద్‌ను డైమండ్ క్యాపిటల్‌గా మారుస్తాం..

మంత్రి శ్రీధర్ బాబు

జ్యువెలరీ ఎగ్జిబిషన్‌ను నిర్వాహకులతో కలిసి సందర్శిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మాదాపూర్, అక్టోబర్ 18: జ్యువెలరీలో హైదరాబాద్ డైమండ్ క్యాపిటల్‌గా అవతరించనున్నదని ఐటీ శాఖమంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన హైదరాబాద్ జ్యువెలరీ ఎక్స్‌పో కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా విచ్చేసి నిర్వాహకులతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జ్యువెలరీలో హైదరాబాద్ డైమండ్ క్యాపిటల్‌గా అవతరించనుందన్నారు. తెలంగాణలోని హైదరాబాద్‌లో ఆకట్టుకునే రీతిలో జ్యువెలరీ పార్క్‌ను తీసుకురానున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో మరింత పెట్టుబడులు పెట్టేందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈనెల 20వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన 150 ఎగ్జిబిటర్లు, 350కి పైగా జ్యువెలరీ స్టాల్స్ ఉండగా, 20 లక్షలకు పైగా సరికొత్త డిజైన్లతో కూడిన ఉత్పత్తులను ప్రదర్శించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఆందోళన

చందానగర్‌లోని జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కొండాపూర్, అక్టోబర్ 18:పేద, మధ్య తరగతి విద్యార్థుల చదువులకు అండగా ప్రభుత్వం అందజేస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలంటూ శుక్రవారం చందానగర్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. చందానగర్ అంబేద్కర్ విగ్రహం ముందున్న రహదారిపై బైఠాయించి డిమాండ్ చేశారు. విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగిస్తే చూస్తూ ఊరుకునేది లేదంటూ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కళాశాలలకు ఫీజులు చెల్లించలేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వానికి కనిపించడం లేదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్ భారీగా జామ్ అయింది. పోలీసులు రంగప్రవేశం చేసి విద్యార్థుల ఆందోళన విరమింపజేశారు.

అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేదిలేదు

- జడ్సీ ఉపేందర్‌రెడ్డి
- ప్రజా వినతులపై తక్షణమే స్పందించాలి

పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో సమీక్ష సమావేశంలో జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

మియాపూర్, అక్టోబర్ 18 : అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని, వాటి విషయంలో కఠినంగా చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి అక్రమ నిర్మాణాలను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి నేలమట్టం చేయాలని ఆదేశించారు. వీటిపై చర్యల విషయంలో అధికారులు ఎటువంటి తప్పిదాలకు పాల్పడ్డా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. జోన్ స్థాయిలో పట్టణ ప్రణాళిక విభాగంపై జడ్సీ ఉపేందర్‌రెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సర్కిల్ స్థాయిలో ఎస్‌టీఎఫ్‌ల పనితీరు, కోర్టు కేసులు, ఆర్‌టీఐ, లోకాయుక్త, రహదారి విస్తరణ, టీఎస్ బీపాస్‌లో అనుమతుల ప్రక్రియ, పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుంచి వచ్చే వినతులు, ప్రభుత్వ స్థలాలు, జీహెచ్ఎంసీ పార్కులు, పుట్‌పాత్‌ల, నాలాల ఆక్రమణలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ.. టీఎస్ బీపాస్ ద్వారా అనుమతుల జారీని ప్రభుత్వం సులువు చేసినందున నిర్మాణ దారులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని, అందుకు విరుద్ధంగా చేపట్టే అక్రమ నిర్మాణాలకు నోటీసు లిచ్చి తక్షణమే నేలమట్టం చేయాలని స్పష్టం చేశారు. నిర్మాణాలకు సంబంధించిన కోర్టు కేసుల్లో కౌంటర్‌లను సకాలంలో ఫైల్ చేయాలని, ఏ మాత్రం జాప్యం లేకుండా చూడాలని జడ్సీ ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారంగా రహదారి విస్తరణను ప్రాధాన్యతగా చేపట్టాలని, ఇందుకోసం ఆస్తుల గుర్తింపు, సేకరణను వేగవంతం చేయాలన్నారు. కోర్టు కేసుల్లో ఉన్న స్థలాల్లో ఎట్టి పరిస్థితుల్లో నిర్మాణాలు జరగవద్దని, పర్యవేక్షణ, చర్యల పరంగా నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉపేందర్‌రెడ్డి హెచ్చరించారు. నిర్మాణాల పరంగా క్షేత్రస్థాయిలో తగు తనిఖీలు అత్యంత పకడ్బందీగా చేపట్టాలని, కార్యాలయాల్లో కూర్చుని అనుమతులు మంజూరు చేసే విధానానికి స్వస్తి పలకాలని జడ్సీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీ శ్యామ్‌కుమార్, డీసీలు, ఏసీపీలు, టీపీఎస్‌లు, న్యాక్ ఇంజినీర్లు, ఎస్‌టీఎఫ్ అధికారులు, చైన్ మన్లు పాల్గొన్నారు.

ఆపదలో ఆపన్న హస్తం సీఎం సహాయనిధి

జయశ్రీ గోపాల్, కృష్ణశ్రీ, సౌమ్యలను అభినందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్,అక్టోబర్ 18: ఆపదలో ఉన్న పేదలకు ఆపన్నహస్తం అందిస్తూ సీఎం సహాయనిధి పథకం ఆదుకుంటున్నదని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. తన నిరంతర సేవల ద్వారా నిరుపేదలకు ఆరోగ్య సంజీవనిగా ఉపయోగపడుతున్నదన్నారు. కూకట్‌పల్లి డివిజన్ పాపారాయుడునగర్ కాలనీకి చెందిన సమ్మారావుకు అత్యవసర వైద్య సేవల నిమిత్తం సీఎం సహాయ నిధి పథకం ద్వారా రూ. 24వేల ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో గాంధీ శుక్రవారం తన నివాసంలో అందించారు. ఈ పథకం సాయంతో నిరుపేదలు సైతం కార్పొరేట్ దవాఖానలలో ఉచితంగా వైద్య సేవలను పొందుతున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

– ఆల్విన్‌కాలనీ డివిజన్ ఫేజ్-2 అధ్యక్షులు కృష్ణారావు మనుమలు జయశ్రీగోపాల్ క్రిష్, కృష్ణశ్రీ, సౌమ్యలు వేర్వేరు దవాఖానలలో ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించిన సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ వారిని తన నివాసంలో అభినందించారు. తోటి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని, కోర్సును దిగ్విజయంగా పూర్తి చేసి భవిష్యత్‌లో చక్కని వైద్య సేవలందించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఘనంగా సన్మానించారు. కృష్ణారావు, కట్ట శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మిక విభాగం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా సుదర్శన్‌రెడ్డి

కుత్బుల్లాపూర్,అక్టోబర్18 : కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా కొంపల్లి ప్రాంతానికి చెందిన పార్టీ సీనియర్ నేత కందాడి సుదర్శన్‌రెడ్డి నియామకమయ్యారు.శుక్రవారం టీపీసీసీ కార్మిక విభాగం రాష్ట్ర చైర్మన్ ఆర్.ప్రకాశ్‌గౌడ్ చేతులమీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. పార్టీలో క్రియాశీలకంగా పని చేసిన ప్రతి ఒక్కరికీ పార్టీ గుర్తింపు ఇస్తుందని చైర్మన్ ఆర్.ప్రకాశ్‌గౌడ్ సూచించారు. తన నియామకానికి సహకరించిన ప్రతిఒక్కరికి జిల్లా అధ్యక్షులు సుదర్శన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసిన ప్రజలు



ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు శుక్రవారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరగా, ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించారు. అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తన దృష్టికి వచ్చే ప్రతి సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. *– దుండిగల్, అక్టోబర్ 18*

పెండింగ్ పనులు సకాలంలో పూర్తి చేయాలి

హస్మత్‌పేట శ్మశానవాటికను సందర్శించిన కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, జీహెచ్ఎంసీ అధికారులు

బాలానగర్, అక్టోబర్ 18 :పెండింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని హస్మత్‌పేట హిందూ శ్మశానవాటిక పనులను, బోయిన్ చెరువు అభివృద్ధి పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ ప్రజల సంక్షేమం కోసం పని చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో కూడా కోట్లాది నిధులు కేటాయించి అనేక అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ గోవర్ధన్‌గౌడ్, ఏఈ ఆశ, రంగయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత, దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు, బీఆర్ఎస్ శ్రేణులు శంభీపూర్‌కృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమతమ ప్రాంతాల్లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. *– దుండిగల్, అక్టోబర్ 18*

వ్యర్థాలను తొలగించాలి

ఆల్విన్‌కాలనీ డివిజన్ పీజేఆర్‌నగర్ కాలనీలో డ్రైనేజీ మరమ్మతు పనులను కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీలు, నాలాలో పేరుకుపోతున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, మురుగునీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చూడాలని సూచించారు. సమస్య పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ వెంకటేశ్ పేర్కొన్నారు. *– మియాపూర్, అక్టోబర్ 18*

జగద్గిరిగుట్టలో కార్మికులకు స్థలం కేటాయించండి

భవన నిర్మాణ కార్మికుల కోసం జగద్గిరిగుట్టలో స్థలం కేటాయించాలని ఏఐటీయూసీ నేతలు కోరారు. శుక్రవారం రాష్ట్ర కార్మికశాఖ ఉపకార్యదర్శి గంగాధర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఏడాది కాలంగా శాశ్వత అడ్డాకోసం వినతిపత్రాలు ఇచ్చినా అమలు జరగలేదన్నారు. జగద్గిరిగుట్టలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయినా అధికారులు పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం లాస్ట్‌బస్టాపులో కార్మికులు నిల్వనీడలేని పరిస్థితి ఉందన్నారు. సమస్యపై వివరిస్తూ స్థలం కేటాయించేలా కలెక్టర్‌కు నివేదించాలని కోరారు. యూసఫ్, ఉమామహేశ్, హరినాథ్, రవి, రాము తదితరులు పాల్గొన్నారు. *– జగద్గిరిగుట్ట, అక్టోబర్ 18*

గంజాయికి యువత బానిస..

కేసులు నమోదు చేసినా ఆగని విక్రయాలు

అల్లాపూర్, అక్టోబర్ 18:అల్లాపూర్, మోతీనగర్ ప్రాంతాల్లో గంజాయి సేవిస్తున్న యువతతో వారి కుటుంబాలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నాయి. ముఖ్యంగా 20 ఏండ్ల లోపు యువత మత్తుకు బానిసై తమ జీవితాలను అంధకారంలోకి నెట్టేసుకుంటున్నారు. స్కూల్ పిల్లలకు సైతం చాక్లెట్ల రూపంలో మత్తును అలవాటు చేసి బానిసలుగా మారుస్తున్నారు.

మోతీనగర్ పరిధి స్నేహపురి కాలనీకి ఆనుకొని ఉన్న పశువుల సంత గేటు వద్ద ప్రతిరోజు జులాయిగా తిరుగుతున్న కొందరు యువకులు గుంపులుగా చేరి గంజాయి సేవిస్తుండటంతో పరిస్థితి ఆందోళనకరంగా మారుతున్నది. ఇంతటితో ఊరుకోకుండా గంజాయి మత్తులో కుటుంబసభ్యులతో, కాలనీవాసులతో గొడవ పడుతున్నారు. ఓ గ్యాంగు గంజాయి మత్తులో రోడ్లపై తిరుగుతూ.. అడ్డు వచ్చిన వారితో గొడవలకు దిగుతూ.. అతి క్రూరంగా రాళ్లలో దాడికి పాల్పడుతున్నారు. ఇటీవల కొందరు యువకులపై విచక్షణా రహితంగా దాడులకు తెగబడి తీవ్రంగా గాయపర్చారు. ఈ ఘటన అప్పట్లో కలకలం రేపింది. దీనిపై ఎమ్మెల్యే సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన యువకులను కఠినంగా శిక్షించాలని పోలీసులను ఆదేశించారు. కేసు నమోదు చేసిన పోలీసులు సదరు యువకులను రిమాండ్‌కు తరలించారు. తాజాగా అదే తరహాలో దసరా మరుసటి రోజు ఇద్దరు యువకులతో వాగ్వాదానికి దిగిన ఆ గ్యాంగు రాళ్లతో తలపై మోది తీవ్రంగా గాయపర్చారు. ఈ ఘటనలన్నీ గంజాయి మత్తులో జరిగాయని తెలిసినప్పటికీ, ఏదో అలా కేసులు నమోదు చేసి నామమాత్రపు చర్యలతో పోలీసులు సరిపెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గంజాయి సరఫరాను అరికట్టాలని పలువురు పోలీసులను, ఎక్సైజ్ అధికారులను కోరుతున్నారు.

ఆందోళనకరంగా బిర్యాని కేంద్రాలు

రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు,ఛాయ్ దుకాణాలు రాత్రి ఒంటిగంట వరకు నడుపుకోవచ్చని ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కానీ, అల్లాపూర్ బ్యాంకు కాలనీలో రాత్రి ఒంటిగంట దాటాక 4 ఏఎం బిర్యాని సెంటర్ల పేరుతో రాత్రంతా వ్యాపారాలు సాగుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు స్పందించి బ్యాంకు కాలనీలో నడుస్తున్న 4ఏఎం బిర్యాని కేంద్రాలకు అడ్డుకట్ట వేసి, శాంతి భద్రతలను పరిరక్షించడంతోపాటు గంజాయికి అలవాటు పడుతున్న యువతను కూడా కాపాడాలని పలువురు కోరుతున్నారు.

నిఘా ఏర్పాటు చేస్తాం..

గంజాయి సేవించినా.. సరఫరా చేసినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. నిఘాను ఏర్పాటు చేసి గంజాయి సఫరాను అడ్డుకుంటాం. గంజాయి సేవించి యవత భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దు.

– వేణుకుమార్, ఎక్సైజ్ సీఐ బాలానగర్

చదివింది ఇంజినీరింగ్..చేసేది గంజాయి వ్యాపారం

- కూకట్‌పల్లిలో ఇద్దరు వ్యక్తులు అరెస్ట్
- రూ.20.25లక్షల విలువజేసే సొత్తు స్వాధీనం

నిందితులను అదుపులోకి తీసుకున్న ఎస్‌వోటీ పోలీసులు

సిటీబ్యూరో, అక్టోబర్ 18(నమస్తే తెలంగాణ): ఇంజినీరింగ్ చదివి విలాసవంతమైన భవనంలో ఉంటూ ఖరీదైన కార్లలో తిరుగుతూ జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నారు. కానీ ఇంజినీరింగ్ ఉద్యోగంతో కాదు.. గంజాయి వ్యాపారంతో.. చదివింది ఇంజినీరింగ్ అయినా మూడోకంటికి తెలియకుండా గంజాయి వ్యాపారం చేస్తూ తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.20.25లక్షల విలువజేసే సొత్తు స్వాధీనం చేసుకున్నారు. స్టేట్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. ఖమ్మం ప్రాంతానికి చెందిన బేగం నిలేష్‌కుమార్, వరంగల్ డోర్నకల్‌కు చెందిన సిరాజుల్లా ఖమ్మంలో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఇద్దరూ క్లాస్‌మెట్స్ కావడంతో నగరానికి వచ్చి కూకట్‌పల్లి వసంతనగర్ రోడ్ నెం.21లోని అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. స్నేహితులిద్దరూ కలిసి మోడల్ ఫొటోగ్రఫీ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఇది న